# ప్రజాశక్తి

బుధవారం 25 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా






# పారదర్శకంగా నష్ట గణన పూర్తి

**● కలెక్టర్ డాక్టర్ సృజన ● నేడు బాధితుల ఖాతాల్లో పరిహారం జమ**
**● 38వ వార్డు ఎన్యుమరేషన్ పరిధిలోకి రాదు**

**ప్రజాశక్తి - విజయవాడ :** ముంపు ప్రభావిత 179 సచివాలయాల పరిధిలో అత్యంత పారదర్శకంగా నష్ట గణన ప్రక్రియను పూర్తిచేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సజన మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న బాధితుల ఖాతాల్లో డిబిటి విధానం ద్వారా నేరుగా పరిహారం మొత్తాన్ని జమచేయనున్నట్లు వెల్లడించారు. ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా ఉండకూడదనే అర్హుల జాబితాలను సచివాలయాల్లోనూ ప్రదర్శించినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ సమయంలో ఇళ్లవద్ద లేని వారిని కూడా ప్రత్యేక బందాలతో ఆది, సోమవారాల్లో ప్రత్యేకంగా నమోదు చేసినట్లు వివరించారు. ముంపు ప్రాంతాల్లో కుటుంబాలకు జరిగిన నష్టాన్ని 1500 బందాలతో అంచనా వేశామన్నారు. ఐఏఎస్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులతో రీ వెరిఫికేషన్ ప్రక్రియను కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారి దరఖాస్తులను కూడా పరిశీలించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబు భరోసా కల్పించారని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరమే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. 38వ వార్డు నివాసితులు కొందరు తమను కూడా ముంపు బాధితుల జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారని, అయితే ఈ వార్డు ఎన్యూమరేషన్ పరిధిలోకి రాదని అన్నారు. అందువల్లే సర్వే నిర్వహించలేదని వివరించారు.

## బాధితులపై పోలీసుల దౌర్జన్యం సరికాదు : మాజీ మంత్రి వెలంపల్లి

**ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ :** నగరంలోని 38వ డివిజన్ కుమ్మరిపాలెం పరిసర ప్రాంత వదర బాధితులను మంగళవారం వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. అనంతరం సంబంధిత సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి వరద వల్ల నష్టపోయిన బాధితులందరి పేర్లనూ నష్టగణన జాబితాలో చేర్చాలని కోరారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఆందోళనకు దిగిన బాధితులపై పోలీసులు దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. బాధితులు ఆందోళన చేస్తే స్థానిక ఎంఎల్‌ఎ సుజనా చౌదరి, ఎంపీ కేశినేని చిన్ని ఒక్కరు కూడా రాలేదన్నారు.

**ఆదుకోవాలని కలెక్టర్‌కు వైసిపి నేతల వినతి**

వరద బాధితులందరికీ ప్రభుత్వ సాయం అందించాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు వైసిపి నేతలు వినతిపత్రం సమర్పించారు. 38వ డివిజన్లోని 119, 159, 194 వార్డు సచివాలయాలు సహా సెంట్రల్లోని పలు ప్రాంతాలలో సర్వే బందాలు



ఇప్పటివరకు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వరద తీవ్రతకు అనేక మంది వేరే ఊర్లలో తలదాచుకున్నారని, కొంత మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని చెప్పారు. వీరందరినీ దష్టిలో పెట్టుకుని ఎన్యుమరేషన్ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించాలని కోరారు. ఉపాధి కోల్పోయిన దాదాపు 5 వేల మంది ఆటో కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమాల్లో వెలంపల్లితోపాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ మాజీ ఎంఎల్ఎ మల్లాది విష్ణు, వైసిపి పశ్చిమ ఇన్చార్జి షేక్ ఆసిఫ్, పలువురు వైసిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాల గుర్తింపుపై వివక్ష తగదు

**సిపిఎం నేతలు బాబూరావు, సత్యబాబు**

**ప్రజాశక్తి - విజయవాడ :** వరద ప్రాంతాల గుర్తింపులో వివక్ష తగదనిసిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు అన్నారు. కృష్ణానది, బుడమేరు వరదలతో ముంపునకు గురైన విజయవాడ కుమ్మరిపాలెం, భవానీపురం, కష్ణాకర కట్ట ప్రాంత బాధితులను మంగళవారం సిపిఎం నేతలు పరామర్శించారు. ఆయా ప్రాంతాల్లోని వరద బాధితులను కలుసుకొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాబూరావు, సత్యబాబు మాట్లాడుతూ బాధితులకు నిత్యావసర సరుకులు కూడా అందించక పోవడం దారుణమన్నారు. పలు ప్రాంతాల్లో ఎన్యుమరేషన్లో లోపాలు జరిగాయని బాధితులు రోడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని అందరికీ న్యాయం చేసేవిధంగా ఆదేశాలు ఇవ్వాలన్నారు. బాధితుల గొంతు నొక్కే ప్రయత్నాలు చేయొద్దన్నారు. బాధితులను దౌర్జన్యాలతో ఇబ్బందులకు గురి చేయటం అమానుషమని పేర్కొన్నారు. ఈపర్యటనలో సిపిఎం, కార్మిక, ప్రజా సంఘాల నేతలు ఇవి.నారాయణ, సుబ్బారెడ్డి, శేషమణి, విక్రమ్ లక్ష్మి, మస్తాన్, వెంకట్రావు పాల్గొన్నారు.

# ఇళ్లు కూల్చివేత

**● మచిలీపట్నంలో ఉద్రిక్తత ● అధికారుల చర్యపై బాధితుల ఆగ్రహం**



ఇళ్లు కూల్చివేసిన దృశ్యం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** నిబంధనలకు వ్యతిరేకంగా మడుగు పోరంబోకు భూమిలో నిర్మించిన 180 గహాలను భారీ పోలీసు బందోబస్తు మధ్య మచిలీపట్నం నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం కూల్చివేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. స్థానికులకు, అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారుల చర్యపై బాధితులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. స్థానిక కుమ్మరిగూడెంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న 22 ఎకరాల మడుగు భూమిలో అప్పటి శాసనసభ్యులు పేర్ని నాని పేదలకు నివేశన స్థలాలు మంజూరు చేశారు. విద్యుత్ కనెక్షన్లు కూడా ఇప్పించి వారితో గహ నిర్మాణాలు చేపట్టారు. దీంతో అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న కొల్లు రవీంద్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో ఆ అక్రమణలను తొలగించారు. ముందుగా మడుగు పోరంబోకు భూమి అక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. వీటికి స్పందించకపోవటంతో పోలీసు బందోబస్తు మధ్య పొక్లయినర్ల సాయం తొలగించారు. అధికారుల చర్యపై అక్రమణదారులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. అప్పటి శాసనసభ్యులు పేర్ని నాని చెబితేనే తాము ఇక్కడ గహాలు నిర్మించుకున్నామని, నేడు అక్రమణలంటూ తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. తాము కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని ఎవరు పూడుస్తారని ప్రశ్నిస్తున్నారు. దీనిపై నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లోగానీ, అనుమతి లేని ప్రాంతాల్లోగానీ నిర్మాణాలు చేపడితే ఇలాంటి చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ఆర్‌టిసి చైర్మన్‌గా కొనకళ్ల



**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం మాజీ ఎంపి, టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్‌గా నియమితులయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించగా, ఎంపి కొనకళ్లకు ఆర్‌టిసి చైర్మన్ పదవిని కట్టబెట్టారు. కొనకళ్ల 2009 - 2014లో మచిలీపట్నం లోక్‌సభకు వరుసగా రెండు పర్యాయాలు ఎంపిగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. జిల్లాలో బిసి సామాజికవర్గానికి చెందిన బలమైన సీనియర్ నేతగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా మచిలీపట్నం ఎంపి స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించగా... కొనకళ్ల పార్టీ నిర్ణయానికి కట్టుబడి కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి గెలుపునకు కషి చేశారు. ఈ నేపథ్యంలోనే కొనకళ్లకు ఆర్‌టిసి చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఆయన నియామకం పట్ల కూటమి నాయకులు, కార్యకర్తలతోపాటు కొనకళ్ల అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# వరద బాధిత రైతుల సమస్యలపై ఐక్య ఉద్యమం

**● ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య**

**ప్రజాశక్తి - తోట్లవల్లూరు :** విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్న రైతులకు, కౌలు రైతులకు న్యాయం జరిగే వరకు ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వాన్ని నిలదీద్దామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య అన్నారు. కృష్ణాజిల్లా తోట్లవల్లూరు బస్టాండ్ సెంటర్లో మంగళవారం రైతు కౌలు రైతుల సదస్సు సంఘం మండల అధ్యక్షులు సిహెచ్.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో వి.కష్ణయ్యతోపాటు కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య మాట్లాడుతూ వరదలకు సర్వం కోల్పోయిన రైతు కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆదుకోవాలని కోరారు. బడ్జెట్లో రూ.15 వేల కోట్లు పంటల బీమా కోసం ప్రకటించారని, ఆ నిధులను ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు బీమా రూపంలో అందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల పరిహారం (మిగతా 2లో)




సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

## జిల్లా గిరిజన సంక్షేమాధికారిగా ఫణి ధూర్జటి



**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** కృష్ణా జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారిగా ఫణి ధూర్జటి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఆయన బాపట్ల జిల్లా నుంచి ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆయన కలెక్టరేట్లో కలెక్టర్ డికె బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు.

## పటమటలంక ప్రాంత సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - విజయవాడ :** పటమటలంక ప్రాంతంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు పి కృష్ణ తదితరులు విఎంసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పటమటలంక ప్రాంతంలో ప్రజాసమస్యలు తిష్ట వేశాయని, పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడంలేదని అన్నారు. నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించాలని, యుజిడి వ్యవస్థను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. 14వ డివిజన్లో దెబ్బతిన్న రహదారులను బాగు చేయాలని, పాఠశాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని, బందరు రోడ్డు ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించి, వాటిని బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు వి.గురుమూర్తి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో నష్ట గణనకు 15,659 దరఖాస్తులు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్ట గణన సర్వేకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఆది, సోమవారాల్లో చేపట్టిన సర్వేకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రెండు రోజుల ఈ ఎన్యుమరేషన్ ప్రక్రియలో విజయవాడ నగరం నుండి 14,470 మంది, రూరల్ ప్రాంతం నుండి 1189 మంది దరఖాస్తు చేశారు. నగరంలోని 32 డివిజన్లు, 286 సచివాలయాల పరిధిలో ఎన్యుమరేషన్ జరిగింది. 1478 మంది సిబ్బంది ప్రత్యేక ఫ్లడ్ ఎన్యుమరేషన్ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. 1,67,176 ఇళ్లకు వెళ్లి ఎన్యుమరేషన్ చేపట్టారు.

## 46 మందికి జరిమానా

**ప్రజాశక్తి - విజయవాడ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 46 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. నగరంలోని 1, 2, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 46 కేసుల్లో నిందితులను మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి ఆర్.వి.శర్మ లెనిన్ బాబు ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 39 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

## ప్రతి ఆటోకూ రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

### డిఆర్‌ఒకు ఆటో సంఘాల వినతి

**ప్రజాశక్తి - విజయవాడ :** వరదల్లో కూరుకుపోయిన ప్రతి ఆటోకి రూ.25 వేల పరిహారం ఇప్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ వి.శ్రీనివాసరావుకు ఆటో సంఘాల నేతలు వినతిపత్రం సమర్పించారు. బీమా కంపెనీల మోసాలను అరికట్టాలని, సర్వీస్ కంపెనీల్లో ఆటోల రిపేర్లు వేగవంతం చేయాలని కోరారు. ఆటో కార్మికులను బీమా కంపెనీలు ఆదుకోవాలని, పూర్తిస్థాయిలో బీమా ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. బి6, బి4 వంటి ఆటోలకు రిపేర్ల ఖర్చు వాహన కంపెనీల వారు లక్ష రూపాయల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారని, కానీ బీమా కంపెనీల వారు వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో ఆరేడు వేల రూపాయలు మాత్రమే ఇస్తామని, ఇందుకు అంగీకరించకపోతే పైసా కూడా రాదని కార్మికులను బెదిరించి సంతకాలు తీసుకుంటున్నారని వివరించారు. పైగా నీళ్ళల్లో ఉన్న ఆటోలను ఫోటోలు తీయ లేదని, రికార్డులు ఫోర్స్‌లో లేవనే సాకుతో కొన్ని కంపెనీలు బీమా ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని వివరించారు. మరోవపు 25 రోజులకుపైగా ఆటోలను రిపేర్ల కోసం కంపెనీల్లో ఉంచాల్సి రావడంతో ఉపాధి కోల్పోతున్నారని వివరించారు. పాత ఆటోల వారు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ మాత్రమే చేయించుకున్నారని పేర్కొన్నారు. అందువల్ల బీమా ఉన్నా లేకపోయినా ముంపుకు గురైన ప్రతి ఆటోకు ప్రభుత్వం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నగర అధ్యక్షులు డి.శ్రీనివాసరావు, సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, టిఎన్‌టియుసి సెంట్రల్ అధ్యక్షులు గరిమెళ్ల చిన్నా, పిఎంటిడబ్ల్యుయు అధ్యక్షులు కె.వరమేశ్వరరావు, ఐఎఫ్‌టియు-2 నాయకులు కనకారావు పాల్గొన్నారు.



## కోతులు, కుక్కలను నివారించండి

### ర్యాలీలో పౌర సమాజం నేతల డిమాండ్

**ప్రజాశక్తి - తిరువూరు :** కోతులు, కుక్కల బెడదను నివారించాలని కోరుతూ మంగళవారం పౌర సమాజం ఆధ్వర్యాన తిరువూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగర పంచాయతీ కమిషనర్ లోవరాజుకు వినతిపత్రం అందజేశారు. బైపాస్ రోడ్డు వినాయక దేవాలయం నుండి మెయిన్ రోడ్డు మీదుగా నగర పంచాయతీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిత్యం పిల్లలను, వృద్ధులను, మహిళలను సైతం గాయాలపాలుచేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్న కోతులు, కుక్కలను నివారించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ... ప్రజలపై దాడి చేస్తూ, ఇళ్లలోని వస్తువులు, ఆహార పదార్థాలను ఎత్తుకెళుతున్న కోతులు, కుక్కలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇళ్ల పరిసరాల్లో, పెరటి తోటలో పండిన పండ్లు, కూరగాయలను, రైతులు సాగుచేసిన పంటలనూ కోతులు నాశనం చేస్తున్నాయని పేర్కొన్నారు. కోతులకు భయపడి పిల్లలు, మహిళలు తలుపు గడులు పెట్టుకుని జీవనం సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, మహిళల చేతుల్లో ఉన్న ఆహార పదార్థాలు, విలువైన వస్తువులను సైతం కోతులు దాడి చేసి ఎత్తుకుపోతున్నాయని అవేదన వ్యక్తం చేశారు. కోతులు, కుక్కల దాడుల నుంచి ప్రజలను కాపాడాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం తిరువూరు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేకల నాగేంద్ర ప్రసాద్, జి.కృష్ణమోహన్, పౌర సమాజం నాయకులు మోరంపూడి రాంబాబు, జ్యోతి, మరీదు సీత, వినాయక దేవాలయం పాలకవర్గ సభ్యులు నంద్యాల ఆంజనేయులు, పామర్తి ఏడుకొండలు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వసుమర్తి వెంకటేశ్వర రావు, కొమ్మినేని రాజేష్ ఖన్నా, గంజా కృష్ణ మోహన్, సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్.నాగేశ్వరరెడ్డి, కె.వి.రత్నం, ఆకుల రవి, సాంబారు వెంకటేశ్వర్లు, బి వెంకటేశ్వర్లు, పంతంగి శ్రీనివాసరావు, ఐద్వా నాయకులు పి.తులసిరాణి, సిపిఐ నాయకులు మాలపాటి ఉదయ్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



## తొలగించిన చిరుద్యోగులను విధుల్లోకి తీసుకోండి : హైకోర్టు

**ప్రజాశక్తి - వీరులపాడు :** రాజకీయ కారణాలతో తొలగించిన చిరుద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. రాజకీయ కారణాలతో వీరులపాడు మండలంలో 30 మంది చిరుద్యోగులను అధికారులు తొలగించారు. దీంతో వారు తమను తిరిగి ఉద్యోగాల్లో నియమించేలా చేయాలని స్థానిక టిడిపి నాయకులకు, ఎంఎల్‌ఎకు విన్నవించుకున్నారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో ఆందోళన చేపట్టారు. కొందరు జిల్లా కలెక్టర్ ఆశ్రయించారు. న్యాయం జరగపోవటంతో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు బాధితుల పిటిషన్‌ను విచారించి చిరు ఉద్యోగులను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా తొలగించడం చట్ట ప్రకారం కుదరదని, తొలగించిన వారిని వెంటనే విధుల్లో తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. చిరు ఉద్యోగులు తరఫున హైకోర్టు మహిళా న్యాయవాది సారేపల్లి వరలక్ష్మి వాదించారు. హైకోర్టు తీర్పు పట్ల చిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇది చేతల ప్రభుత్వం : ఎంపి శివనాథ్

**ప్రజాశక్తి - వన్‌టౌన్ :** కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చే ప్రభుత్వమని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. 55వ డివిజన్ నైజాం గేట్ ప్రాంతంలో మంగళవారం జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు.



## వరద బాధిత రైతుల సమస్యలపై ఐక్య ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

వల్ల రైతుకు ఒరిగేదేమీలేదన్నారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.1.30 లక్షలకు నష్టపరిహారాన్ని పెంచి రైతులను అందించాలని కోరారు. రైతుల బ్యాంకు రుణాలు పూర్తిగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రైతులను చిన్నచూపు చూసే విధంగా ఉందన్నారు. వరికి రూ.10 వేలు, మిగిలిన వాణిజ్య పంటలకు రూ.14 వేలు పరిహారం ప్రకటించడం దారుణమన్నారు. పెట్టిన పెట్టుబడిని బట్టి నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. సిఎం చంద్రబాబు చెప్పిన విధంగా భూ యజమానికి సంబంధం లేకుండా వాస్తవ రైతు, కౌలు రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా అందేలా చూడాలని కోరారు. ఈ క్రాప్ నమోదులో ఎడిట్ ఆప్షన్ ఇంకా పది రోజులు పెంచి రైతులకు అవకాశం కల్పించాలని కోరారు.

ఇసుక మేట వేసిన పొలాలను బాగుచేయాలి

ఇసుక మేట వేసిన రైతుల భూములను ప్రభుత్వం బాగు చేయాలని, పాడైన మోటార్లకు మరమ్మతులు చేయించాలని, రెండో పంట సాగుకు అనుకూలమైన మినుము, మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని కోరుతూ సదస్సు తీర్మానించింది. వరదలకు ఇళ్లు, పశువులు గేదెలు, గొర్రెలు, మేకలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు కోల్పోయిన వారిని గుర్తించి ప్రభుత్వం వాటిని సమకూర్చాలని కోరింది. ఈనెల 30న బాధిత రైతులతో వెళ్లి కలెక్టర్‌ను కలవాలని నిర్ణయించింది. ఈ సదస్సులో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.శివ నాగేంద్రం, పంచకర్ల రంగారావు, ఉపాధ్యక్షురాలు శైలజ, వి.శంకర్, టి.నరేష్, కొండల బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్ల వరకు రైతులు కోలుకునే పరిస్థితిలేదు

### కౌలు రైతు తోట సాయిబాబు ఆవేదన



బంగారం బ్యాంకులో తాకట్టుపెట్టి మరీ వ్యవసాయం చేశా. ఎకరాకు రూ.40 వేలు కౌలు ముందే చెల్లించా. ఎకరంలో కంద సాగుకు 20 పుట్లు పడుతుంది. ఒక్కో పుట్టు విత్తనం స్థానికంగా అయితే రూ.12 వేలు, బీహార్‌వి అయితే రూ.14 వేలు ఉంటుంది. రూ.2.80 లక్షలతో బీహార్ విత్తనం కొనుగోలు చేశా. సాగు ఖర్చులతో కలుపుకొని రూ.3.50 లక్షలు ఇప్పటివరకు ఖర్చయింది. కానీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారం రూ.14 వేల మాత్రమే. ఇది ఒక పుట్టు విత్తనం కొనడానికి మాత్రమే సరిపోతుంది. దీనివల్ల రైతులకు ఒరిగేదేమీలేదు. పసుపు పంట సాగు చేయడానికి ఎకరాకు ఏడు పుట్ల విత్తనాలు అవసరం అవుతాయి. ఒక్కో పుట్టు రూ.12 వేలు, కౌలు రూ.40 వేలు, సాగు ఖర్చులు మొత్తం కలుపుకుని పసుపు పంట ఎకరాకు ఖర్చు రూ.1.30 లక్షల వరకు అయ్యింది. వరదల్లో అన్ని పంటలూ కొట్టుకుపోయి రైతులకు కన్నీరే మిగిలింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సాగు ఖర్చులకు కూడా సరిపోదు. ప్రభుత్వం రైతుల బాధలను దృష్టిలో పెట్టుకుని కందకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలి. పసుపుకు రూ.70 వేలు, అరటికి రూ.60 వేలు పరిహారం అందిస్తేనే రైతు ఒడ్డున పడతాడు. లేకపోతే ఐదేళ్ల వరకు రైతు కోలుకునే పరిస్థితి లేదు

# ఆరోగ్యకర సమాజమే ఎన్‌ఎస్‌ఎస్ ధ్యేయం

- కెయు రెక్టార్ ఎంవి బసవేశ్వరరావు




కెయులో మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : ఆరోగ్యకరమైన సమాజమే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల లక్ష్యం అని, నిజమైన సమాజ సేవకులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడం వలన ప్రకృతిలో సమతుల్యం దెబ్బతింటోందని, దాని ఫలితమే ప్రకృతి వైపరీత్యాలు అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు గురించి సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత వాలంటీర్లపై వుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్‌బాబు మాట్లాడుతూ దైనందిన జీవితంలో చిన్న చిన్న అలవాట్లను మార్చుకోవడం ద్వారా సమాజంలో మార్పుకు నాంది పాలకవచ్చని చెప్పారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్ స్థానంలో స్టీల్, గాజు బాటిల్ తీసుకురావడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య ఎన్ ఉష, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం పలు అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలను అతిథుల చేతులమీదుగా అందచేసారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా స్వరూపా, డా రవి, డా సుజయ్, డా కవిత, పిడి గోపి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం అవతరణ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ పాల్గొని ఆయన మాట్లాడుతూ యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించి దేశ భవిష్యత్తులో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఈ జాతీయ సేవా పథకానికి అంకురార్పణ జరిగిందని తెలిపారు. విద్యార్థుల్లో సేవా దక్పథం పెంపొందించుకోవడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న ఈ కార్యక్రమాలన్నీ నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ లక్ష్మణరావు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథికి మెమెంటోను అందజేశారు. ఎన్ ఎస్ ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి నవీన్ కుమార్, ఎస్ ఆర్ జి ఇ సి సూపర్ డెంట్ జి. సోమరాజు, వి ఎల్ వినోద్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** : జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ వీర కుమారి ఆధ్వర్యంలో విపత్తుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అవనిగడ్డ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పి ఎస్ వి వి ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ వి శేషగిరిరావు విశిష్ట అతిథిగా హాజరై విద్యార్థులకు గ్యాస్ విద్యుత్ ప్రమాదాల నుండి పరిరక్షించుకునే విధానాలను ప్రయోగపూర్వకంగా ఫైర్ సిబ్బంది బి బాలమురళీకృష్ణ వివరించారు. ఫైర్ సిబ్బంది యు. ఏడుకొండలు, జి. యువరాజ్, ఏఆర్ కృష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : జాతీయసేవా పథకం దినోత్సవ వేడుకలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జగన్ మోహనరావు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.బి. ఆనంద కుమార్, యం.శ్రావణి, కోఆర్డినేటర్ ఆర్ హిమాలినీ దేవి, డాక్టర్ కె.సత్య రాజేష్ , రామారావు, జ్యోత్స్న పాల్గొన్నారు.



## రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం

**ప్రజాశక్తి-గన్నవరం** : బి.ఆర్ అంబేద్కర్ బ్యానర్‌ను ఉండి ఎమ్మెల్యే రఘురామకష్ణంరాజు ఏలూరుపాడులో చించేయగా దానిని ఖండిస్తూ హనుమాన్ జంక్షన్‌లో మాల మహానాడు అధ్యక్షుడు బేతాళ శరత్ బాబు ఆధ్వర్యంలో మాల మహానాడు నాయకులు, యువకులు నాలుగు రోడ్ల కూడలిలో నిరసన నిర్వహించారు. ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించి బాపులపాడు గ్రామంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఉండి ఎమ్మెల్యే రఘురామకష్ణం రాజు క్షమాపణ చెప్పాలని ఆయన ఫోటోలను, దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ లో రఘురామకృష్ణం రాజు పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ మంగరాజు, గొల్ల నరేష్, పోలిమెట్ల మోజెస్, మాల మహానాడు కష్ణాజిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొత్తూరు సాగర్ పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్రప్రదేశ్-2047పై సూచనలు ఇవ్వండి : కలెక్టర్

**ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా)** : స్వర్ణాంధ్రప్రదేశ్ -2047 దార్శనిక పత్రం (విజనరీ డాక్యుమెంట్) తయారీపై ప్రజలు తమ సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలియజేసి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. మంగళవారం కలక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వర్ణాంధ్రప్రదేశ్-2047 దార్శనిక పత్రం (విజనరీ డాక్యుమెంట్) తయారీలో ప్రజలను భాగస్వామ్యం చేయడంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రజల సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలిపే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించిందన్నారు.

# డాక్టర్ గోగినేని మృతి తీరని లోటు



భాస్కరరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-గన్నవరం** : హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో తొలితరం డాక్టర్లలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గోగినేని భాస్కరరావు(88) మృతి ఈ ప్రాంతంలో నిరుపేదలకు తీరని లోటని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధన్‌రావు, రాష్ట్ర టిడిపి నాయకులు, సాగునీటి వినియోగ దారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకష్ణారావు అన్నారు. రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండవనేని ఉమా వరప్రసాద్, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు డాక్టర్ భాస్కరరావు పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన కుమారులు అడ్వకేట్ గోగినేని విజయబాబు, డాక్టర్ గోగినేని బాలాజీబాబు, కుమార్తె డాక్టర్ గుండవనేని విష్ణుప్రియలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియ చేశారు.

## ముళ్లపొదలు తొలగింపు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ ఆదేశాల మేరకు అవనిగడ్డలోని పాత ఎడ్ల లంక రోడ్డు సమీపంలో ఉన్న కృష్ణానది కరకట్ట మీదుగా నాగాయలంక వైపు వెళ్లే మార్గంలో మంగళవారం జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. కరకట్ట ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలు తొలగించారు. ఆ రహదారి పాదచా రులు కూడా వెళ్లలేని దుస్థితిలో ఉండటంతో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ జంగిల్ క్లియరెన్స్ నిర్వహించాలని ఆదేశించడంతో గ్రామపంచాయతీ వారి సహకారంతో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బండే రాఘవ, కర్ర సుధాకర్, ఘంటసాల రాజమోహన్‌రావు పాల్గొన్నారు

## క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారిణిలను అభినందిస్తున్న ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-గన్నవరం** : రాష్ట్ర స్థాయి త్రో బాల్ అండర్-19 ఛాంపియన్‌షిప్ పోటీల బాలికల విభాగంలో గన్నవరం హైస్కూల్ ప్లస్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు పుట్ట కీర్తి, మాతంగి రితికలు విశాఖపట్నంలో జరిగిన పోటీలలో కృష్ణా జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించి రజత పతకం కైవసం చేసుకోవడంతో మంగళవారం గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అభినందించారు. ఇదే ఉత్సాహంతో సాధన చేసి ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని సూచించారు. అలాగే ఉత్తమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ ధనియాల నాగరాజును ప్రశంసించారు.

## అండర్-14 జట్లు ఎంపిక

**ప్రజాశక్తి-గన్నవరం** : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 68 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో అండర్ - 14 బాలుర విభాగంలో బాపులపాడు మండల స్థాయి క్రీడ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఏడు క్రీడంశాల్లో కబడ్డి, వాలీబాల్ షటిల్, బ్రాడ్మింటన్, ఖోఖో యోగ, చేసే, అథ్లెటిక్స్ వంటి క్రీడలు నిర్వహించారు. ఇందులో సుమారు 4 వందల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాపులపాడు మండల ఎంఈఓ-1 రాంబాలసింగ్, ఎంఈఓ -2 సురేష్ కుమార్, ఎంపీపీ నగేష్, స్రవంతి చారిట్రాయిల్ ట్రస్ట్ అధినేత వీరమాచినేని సత్యప్రసాద్, వ్యాయమ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు, విశ్రాంత ఉపాధ్యాయులు దయాల ప్రభాకరావుపాల్గొన్నారు.

# రైతులు సేంద్రీయ ఎరువులు వాడాలి




గూడూరు మండలంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిని పద్మావతి

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : రైతులు ఎరువులు పురుగు మందులపై ఖర్చు తగ్గించుకొని సేంద్రీయ ఎరువులు వాడాలని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.కె నాగేంద్ర రైతులకు సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలంలోని వాడపాలెం, సుల్తానగరం గ్రామాలలో మంగళవారం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయాధికారి హరికృకాగిత వెంకటేశ్వరరావు, లంకె నారాయణ ప్రసాద్, వక్కపట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గూడూరు** : పంట భూమిని ఎరువులు పురుగు మందులతో పాడు చేసి భావిత రానికి పంట భూమి లేకుండా చేయొద్దని జిల్లా వ్యవసాయ అధికారిని పద్మావతి రైతులకు సూచించారు. గూడూరు మండలంలోని తరకటూరు గ్రామంలో 'పొలం పిలుస్తోంది 'కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పకతి వ్యవసాయం పై అవగాహన పెంచుకుని దిగుబడి పెంచాలన్నారు. మండల వ్యవసాయ అధికారి జె శివప్రసాద్ ,పకతి వ్యవసాయ రైతులు కమ్మెల రమణ, తోట వినయ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల** : ఘంటసాల మండలం అచ్చంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, ఘంటసాల మండల రెవెన్యూ అధికారి బి.విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి కె.మురళి కష్ణ అధ్యక్షతన పొలం పిలుస్తుందిలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, కొడాలి మార్కెట్ యార్డు సూపర్వైజర్ ఎం.సురేష్ బాబు, ప్రకతి వ్యవసాయ కార్యదర్శి బి.రాంబాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : నందివాడ మండలంలో 'ఇది మంచి ప్రభుత్వం' పొలం పిలుస్తుంది కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జీ, ఎన్డీఏ కుటమీ నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం పొలం పిలుస్తుంది ఎంతగానో ఉపయోగప డుతుందని మండల వ్యవసాయ అధికారి ఎల్ సునీల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగలూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బుధవారం శేరికల్వపూడి, కుచికాయలపూడి గ్రామాలలో జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి జె. చింతయ్య, గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, తదితర రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికులకు వేతనాలివ్వకుంటే విఎంసి ముట్టడి

## సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడ నగర పరిధిలో పని చేస్తున్న సిల్ట్ కార్మికుల వేతనాలతో పాటు విఎంసి ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని, లేనట్లయితే కార్మికులను కలుపుకొని కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తోందని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు హెచ్చరించారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్సు) సత్యవతి, అలాగే ఏ.ఒకు సత్యబాబు మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్మికులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ... నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు సిల్టు తొలగించే కార్మికులకు నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో



వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రజాప్రతినిధులకు ఒక నెల గౌరవ వేతనం, అలాగే అధికారులకు ఒక నెల వేతనం రాకపోతేనే తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని, కానీ కార్మికులకు మూడు నెలల వేతనం ఇవ్వలేదన్నారు. చాలీ చాలనీ వేతనాలు కూడా సరైన సమయానికి ఇవ్వనందున, పెరిగిన ధరలతో కార్మికుల కుటుంబాలు గడవక, అప్పులు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సిల్ట్ కార్మికుల వేతనాలు గత మార్చి నెల నుంచి జూన్ (90 రోజులు) వేతన బిల్లులు నేటికీ చెల్లింపబడలేదన్నారు. దీంతో ఆ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకుల పర్యవేక్షణ, అధికారుల పర్యవేక్షణ కార్యక్రమం పూర్తికాగానే కార్మికులను అర్థాంతరంగా తొలగించి ,నేటి వరకు మూడు నెలలు వేతన బకాయిలు చెల్లించకుండా, కార్యాలయం చుట్టూతా తిప్పుకుంటూ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అలాగే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు, వారిని నియమించిన ఎం/ఎస్ ఆర్కే సర్వీసెస్ ప్రైవేటు కాంట్రాక్ట్ సంస్థ గత రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ కార్మికుల వేతనాల అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైన త్వరగా పరిష్కరించేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హామీనిచ్చినట్లు సత్యబాబు తెలిపారు.



## వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలు

**ప్రజాశక్తి-విస్సన్నపేట:** వనిత వాసవి క్లబ్ విస్సన్నపేట సహకారంతో వాసవి క్లబ్ అధ్యక్షుడు పల్లపోతు చక్రవర్తి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను పల్లపోతు రజిని దాతృత్వంతో నిర్వహించారు. విస్సన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగుల సౌకర్యార్థం దుప్పట్లు అందజేశారు. నాగులూరు గ్రామానికి చెందిన వికలాంగురాలు ప్రవీణ్‌కు మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. రోడ్లపై చిరు వ్యాపారాలకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి మున్నలూరి కేశవ గుప్తా, వనిత కార్యదర్శి సంకా మాధవి, వాసవి క్లబ్ కోశాధికారి గంగిశెట్టి మధు, వనితా క్లబ్ కోశాధికారి కొలిశెట్టి దేవి కనకదుర్గ, కుక్కడపు సతీష్‌కుమార్, పల్లపోతు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పంపిణీ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని తొర్రగుంటపాలెం, డాంగేనగర్‌కు చెందిన తాళ్లూరి గోపాలకృష్ణ, షేక్ జాఫర్‌లకు ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వారు హైదరాబాద్, విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎల్‌ఓసి ద్వారా తాళ్లూరి గోపాలకష్ణకు 7 లక్షల రూపాయలు, షేక్ జాఫర్‌కు రెండు లక్షల రూపాయలను కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలను అందజేశారు.



## కార్మికుని మృతికి సంతాపం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కురమర్తి దేవయ్య (55) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, ప్రజాసంఘాల నాయకులు ఎస్ నాగమణి, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, ఎస్ రామనాథం, కాకనబోయిన లింగారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



## తిరుపతమ్మ ఆలయం డిప్యూటీ కమిషనర్‌గా భూపతిరాజు

**ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:** స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నూతన డిప్యూటీ కమిషనర్‌గా భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా వాడపల్లి దేవస్థానం నుండి ఇక్కడికి వచ్చారు. ఈ ఆలయ డిప్యూటీ కమీషనర్ లీలాకుమార్ గుంటూరు జిల్లా పెద్ద కాకాని ఆలయానికి బదిలీ అయ్యారు. అంతకుముందు నూతన డిప్యూటీ కమిషనర్ ను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# పత్రికా విలేకర్లు, సర్పంచ్‌పై ఎమ్మెల్యే హల్‌చల్



**ప్రజాశక్తి-తిరువూరు:** పత్రికా విలేకర్లపైన, సొంత పార్టీ నాయకులపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హల్‌చల్ చేశారు. అసభ్య పదజాలంతో దూషించారు. తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లో అధికారుల అనుమతి లేకుండా అక్రమార్కులు గ్రావెల్, ఇసుక తరలిస్తున్నారని వివిధ ప్రతికల్లో కథనాలు వచ్చాయి. దీనిని జీర్ణించుకోలేని ఎమ్మెల్యే తన ఉక్రోషమంతా విలేకరులపై చూపించారు. మంగళవారం ఉదయం తిరువూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే టిడిపి నాయకుడైన చిట్యాల గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావును పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం అక్కడి నుంచి రాజస్థాన్ టీ సెంటర్‌లో భవనిర్మాణ కార్మికులతో మాట్లాడుతూ విలేకరులపై, చిట్యాల సర్పంచ్‌పై, పరోక్షంగా కొంతమంది టిడిపి నాయకులపై విరుచుకుపడ్డారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఏ.కొండూరు మండలం గోపాలపురంలో అక్రమంగా 50 వేల ట్రిపుల తవ్విన గ్రావెల్ గొయ్యి ఫొటోలు తీసి ఇప్పుడు పెద్దఎత్తున గ్రావెల్ తరలిస్తున్నారని వార్తలు రాశారని మండిపడ్డారు. అసభ్య పదజాలంతో దూషించారు. తనపై దుష్ప్రచారం చేయాలని చూస్తున్నారని, వాళ్లను క్షమించమని చెప్పారు.

**ఆర్‌డిఒకు మీడియా ప్రతినిధులు వినతి**

పాత్రికేయులపై ఎంఎల్‌ఏ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆర్డీవో కె.మాధవికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు తిరువూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

# భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ


**ప్రజాశక్తి-భవానీపురం:** వరద బాధితులకు భారత్ గ్యాస్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలను అందజేయడం అభినందనీయమని భారత్ గ్యాస్ దక్షిణ భారత జనరల్ మేనేజర్ పీయూష్ గుప్తా అన్నారు. మంగళవారం విజయవాడ విద్యాధరపురంలోని శ్రీ భవాని గ్యాస్ కంపెనీ ప్రాంగణంలో ఇటీవల వరదలకు నష్టపోయిన ప్రజలకు 500 మందికి ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీయూష్ గుప్తా మాట్లాడుతూ ప్రజాసేవే పరమావధిగా భారత్ గ్యాస్ పనిచేస్తుందని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని డిస్ట్రిబ్యూటర్లు కూడా నష్టపోవడం జరిగిందని దీనిపై కూడా వారికి తగిన న్యాయం చేసేలా ఆలోచన చేస్తామని చెప్పారు. భారత్ గ్యాస్ ఆంధ్ర ప్రదేశ్ హెడ్ బాబ్జి మాట్లాడుతూ వరద ప్రాంతాల్లోని ప్రజలకు సహాయ సహకారాలను అందజేసేందుకు భారత్ తమ వంతుకషి చేయడం జరిగిందని చెప్పారు. శ్రీ భవాని గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీహరిబాబు మాట్లాడుతూ వరదల సమయంలో భారత్ గ్యాస్ తరఫున 30 వేల మందికి భోజనాలను అందజేశామని వివరించారు.




అలాగే వివిధ ప్రాంతాల్లో ఉచిత వంట గ్యాస్ స్టవ్‌ల మరమ్మతు సెంటర్లను ఏర్పాటు చేసి 7500 పైగా వంటగ్యాస్ స్టవ్ లను ఉచితంగా రిపేర్ చేసి ఇవ్వడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో భారత్ గ్యాస్ విజయవాడ టెరిటరీ మేనేజర్ వేణుగోపాల్, సేల్స్ ఆఫీసర్ చాంద్ మొండల్, డిస్ట్రిబ్యూటర్లు మల్లాది రాజేంద్ర, శ్రీనివాసరావు, రాజు, శంకర్, అశోక్, ఇందిరాదేవి, ఆకాష్, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

**ప్రజాశక్తి-వత్సవాయి:** ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు విశేష కృషి చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, గరికపాడు కెవికె కోఆర్డినేటర్ కృష్ణంరాజు, జగ్గయ్యపేట సహ సంచాలకులు భవానీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వత్సవాలు వాసవి కళ్యాణ మండపంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంభించినట్లయితే అధిక దిగుబడి సాధించవచ్చు అని అన్నారు. అదేవిధంగా ఆధునిక వ్యవసాయ శాఖ పద్ధతులపై రైతుల అవగాహన కల్పించడం కోసం వ్యవసాయ శాఖ అధికారుల క్షేత్రస్థాయిలో పర్యటన చేసి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి మెరుగైన యాజమాన్య పద్ధతులతో పాటు నూతన సాగు విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏవో రవికుమార్ పాల్గొన్నారు.






## రోడ్డుకు మరమ్మతులు

### ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి-వత్సవాయి:** చిల్లకల్లు-వైరా రహదారిపై ఇటీవల కురిసిన వర్షాలకు చిట్యాల గ్రామ సమీపంలో సప్త వాగు దగ్గర రహదారిపై వరద నీరు ప్రవహించి కోతకు గురైంది. దీంతో మంగళవారం ఆర్‌అండ్‌బి అధికారులు మట్టిని తెప్పించి రోడ్డుకి ఇరువైపులా పోయిస్తున్నారు. ప్రజాశక్తి జిల్లా పేజీలో ఈ నెల 21వ తేదీన 'కోతకు గురైన ఆర్‌అండ్‌బి రోడ్డు' శీర్షికన వార్త ప్రచురించమైంది. దీంతో అధికారులు స్పందించి కోతకు గురైన రహదారులను మట్టి పోసి బాగు చేస్తున్నారు.




## రూ.కోటి విరాళం

**ప్రజాశక్తి-విజయవాడ:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) అధ్యక్షుడిగా ఎంపి కేశినేని శివనాథ్ ఏసిఏ తరుపున వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయల చెక్‌ను సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అందజేశారు. ఏసిఏ అధ్యక్షుడి ఎన్నికైన సందర్భంలో ఎంపి కేశినేని శివనాథ్ ఏసిఏ తరుపున వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కి కోటి రూపాయలు ప్రకటించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కోటి రూపాయలు చెక్ ను అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏసిఏ ఉపాధ్యక్షుడు వెంకట ప్రశాంత్, కార్యదర్శి సానా సతీష్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ గౌరు విష్ణు తేజ్ పాల్గొన్నారు.

## లాఠీఛార్జి సిగ్గుచేటు : సిపిఐ

**ప్రజాశక్తి-భవానిపురం:** వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యాధరపురం 38, 39వ డివిజన్లోని వరద బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకతి వైపరీత్యాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.



## కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** కృష్ణాజిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన గొల్లు కృష్ణ మంగళవారం జిల్లా జిల్లా కలెక్టర్ డీ.కే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావులను వారి వారి చాంబర్లలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. గొల్లుకృష్ణతో పాటు మచిలీపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతిన్, పెనమలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెలిసెల సుబ్రమణ్యం, పిసిసి సభ్యులు కోకా ఫణిభూషణ్‌లు కూడా కలిశారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వినతి

**ప్రజాశక్తి-మొవ్వ :** ఇటీవల వచ్చిన వరదల్లో నష్ట పోయిన పంట రైతులకు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మొవ్వ తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఈడే జయలక్ష్మికి వినతిపత్రం అందించారు. వరికి ఎకరానికి 25 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని, కంద, పసుపు తదితర వాణిజ్య పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, భూమి స్వభావంతో సంబంధం లేకుండా వేసిన ప్రతి పంటను ఈ క్రాప్ చేయాలని, పాడైపోయిన మోటార్లను ఉచితంగా రిపేర్ చేయాలని, ఇసుక మేట వేసిన భూములను ప్రభుత్వమే బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణ, కరుణాకర్‌రావు, కౌలు రైతులు సూర్యనారాయణ, సిహెచ్ సుబ్రహ్మణ్యం, బసవేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘంటసాల ఎంపిడిఒగా సుబ్బారావు బాధ్యతలు

**ప్రజాశక్తి-ఘంటసాల:** ఘంటసాల మండల పరిషత్ అభివద్ధి అధికారిగా డి.సుబ్బారావు మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గూడూరు మండల ఎంపీడీవోగా పని చేస్తున్న ఆయనను ఘంటసాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సుబ్బారావు ఘంటసాల మండల ఈవోపీఆర్డిగా పని చేశారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బారావును ఈఓపీఆర్డి గుత్తికొండ కిషోర్, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, పలు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్లు, పలువురు రాజకీయ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువా పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.


ఎండిఒను అభినందిస్తున్న ఉద్యోగులు

# పౌష్టికాహారంపై అవగాహన

**ప్రజాశక్తి-చల్లపల్లి :** మాతా శిశు సంరక్షణ సూపర్ వైజర్స్ సిహెచ్ ఆదిలక్ష్మి, జె. విశ్రాంతమ్మ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో పోషణ మహోత్స వాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చల్లపల్లి గ్రామపంచాయతీ ప్రెసిడెంట్ పైడిపాముల కృష్ణకుమారి మాట్లాడుతూ పౌష్టికాహారం ఆరోగ్యంగా ఉంటారని సూచిస్తూ పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, పరిసరాల పరిశుభ్రత పై కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి వివరించారు. ఓఎస్‌సి అడ్మిన్ ఆర్చిస్మా మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందకపోవటంతో ఎనీమియా బారిన పడతారని వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు



అందించారు. పౌష్టికాహారం అందించే వంటకాల ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది జి కిషోర్, ఓ ఎస్ సి నుండి సునీత అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల నిరసన

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా గుడ్లవల్లేరు పంచాయితీ వర్కర్స్ యూనియన్(సిఐటియు)ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ ఆఫీసు వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షురాలు మేకల జయలక్ష్మి ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. పంచాయతీల్లో టెండరు విధానం రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వమే పంచాయితీ కార్మికులకు జీతాలు చెల్లించాలని, పీఎఫ్ ఖాతా తెరవాలని దుస్తులు కొబ్బరినూనె చెప్పులు ఇవ్వాలని,కానీసవేతనం 26 వేలు


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికుల నాయకులు నాగేశ్వరమ్మ, సత్తెమ్మ, సుమతి, ఆగ్నేసు, చంద్రకళ, సుమలత, ఉష పాల్గొన్నారు

## 27న జాబ్‌మేళా

**ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ - సీడాప్ సంయుక్త అద్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ఈనెల.27. శుక్రవారం మచిలీపట్నం లోని "ఇమిటేషన్ జ్యువెలరీ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ పార్క్"లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేసారు. ఈ జాబ్ మేళాలో టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, గోల్డ్ ప్రిన్స్ జ్యువెల్ ఇండస్ట్రీ ఇండియా లిమిటెడ్, వి ఎన్ ఆర్ జ్యువెలరీ మాన్యుఫాక్చరర్స్, సుధా గోల్డ్ కవరింగ్ వర్క్స్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీ లలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపిక అయిన వారికి నెలకు సుమారు రూ.10,వేల నుండి రూ.25, వేల వరకు వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని చెప్పారు. తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://skilluniverse.apssdc.in లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెజ్యూమె లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలన్నారు, మరిన్ని వివరాలకు 99664 89796 నంబర్ ను సంప్రదించాలన్నారు.


పొలంలో మట్టి, రాళ్ల కుప్పలు



## పొలాల్లో మట్టి దిబ్బలు, రాళ్ల కుప్పలు

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ఏలూరు కాల్వకు పడిన గండి వల్ల రోజుల తరబడి నీరు ప్రవహించడంతో పొలాల్లో మట్టి దిబ్బలు, రాళ్ల కుప్పలు గుట్టలుగా పడిపోయాయి. 50 ఎకరాల్లో ఈ పరిస్థితి కనిపిస్తుంది. ఏలూరు కలవకు గండిపడడంతో 15 రోజులపాటు నీరు పొలాలను ముంచేసింది. వరి మొత్తం కుళ్ళి పాడైపోయింది. రైతుకు ఎకరానికి పదివేల నుంచి 20వేల నష్టం వాటిల్లుంది. మట్టి మేటలు వేయడంతో పొలం ఎందుకో పనికిరాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టిని తొలగించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని రైతుల కోరుతున్నారు.

## నూతన ఇఒ బాధ్యతల స్వీకారం


ఆకుల కొండలరావు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఉమ్మడి జిల్లాలలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానానికి నూతన కార్య నిర్వహణాధికారిగా ఆకుల కొండలరావు సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. జంగారెడ్డిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో పనిచేస్తున్న కొండలరావు సాధారణ బదిలీపై వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన కార్య నిర్వహణాధికారిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ కార్యనిర్వహణాధికారి పనిచేస్తున్న కానూరి సురేష్ బాబు యన్‌టిఆర్ జిల్లా, వేదాద్రి, శ్రీ లక్ష్మి నరిసింహ స్వామి దేవస్తానునకు బదిలీ అయినట్లు తెలి పారు. కొండాలమ్మ దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన కొండలరావు మాట్లాడుతూ కొండాలమ్మ అమ్మవారి దేవస్థాన అభివద్ధికి తాను కషి చేస్తానని తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా తగు చర్యలు చేపడతానని తెలిపారు. అనంతరం మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముని, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావులను ఆకుల కొండలరావు మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చాలు అందజేశారు.



## గోగినేనిపాలెం జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-ఘంటసాల :** బేసిక్ రీసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ(బ్రెడ్, హైదరాబాదు) వారు నిర్వహించిన ఎంపిక పరీక్షలలో గోగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు కోనేరు వల్లీ కుమారి, యార్లగడ్డ రాజేష్, ఈపూరి లిప్సిక, కుంపటి ఆకాష్‌లు ఉత్తమ పుస్తక సమీక్షకులుగా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తెలియజేశారు. పిల్లల గ్రంథాలయం (బ్రెడ్, హైదరాబాద్) వారు, పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను పంపించారని, వాటిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు ఆధ్వర్యంలో, పాఠశాల లైబ్రరీ అసిస్టెంట్ అనుమకొండ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుధాకరరావు బసవేశ్వరరావు పిచ్చేశ్వరరావు బిజిలిరాణి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్యామలత ల చేతుల మీదుగా విద్యార్థులకు అందించామన్నారు.

## హీరో కృష్ణ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని వినతి

**ప్రజాశక్తి - గుడివాడ :** పట్టణంలో సూపర్ స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని కృష్ణ ఫ్యాన్స్ మాజీ అభిమానులు మంగళవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వగృహంలో కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే రాము కృష్ణ విగ్రహం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కష్ణ ప్రజాశక్తి అధ్యక్షులు అడుసుమిల్లి రాజేంద్రప్రసాద్, మహదేవన్, కొల్లిపర సాయిసుబ్రహ్మణ్యం, పాలడుగు రాంబాబు, శ్రీనివాస్ పొట్ల శీను, పొగిరి రమణ, కొత్త పూర్ణచంద్రరావు, పెద్దు రమణరాజు, కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీరు తొలగింపు

**ప్రజాశక్తి-పెదపారుపూడి :** మండలంలోని భూషణగుళ్ళ గ్రామంలో స్వచ్ఛత హీ సేవాలో భాగంగా పశువుల హాస్పిటల్ ప్రాంగణంలో మురుగు నీటిని తొలగించి బ్లీచింగ్ చాల్లారు. ఈ సందర్భంగా పామర్రు అసెంబ్లీ ఐటీడీపీ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపంగి శ్రీకాంత్. మాట్లాడుతూ ఎవరో వచ్చి చేస్తారు అని లేకుండా ఎవరి ఇంటి ప్రాంగణంలో వాళ్లు శుభ్రం చేసుకో వాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫ్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాల ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపి, ఇఒ

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 3 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) గుడివాడ శాసనసభ్యులు వేనిగండ్ల రాము శ్రీ దుర్గా మల్లేశ్వర దేవస్థానం ఈవో కె ఎస్ రామారావు లతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఉత్సవాల విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి నిర్దేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమి నేతల సహకారంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తవుతున్నాయని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను ముమ్మరం చేసామన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ప్రభుత్వాధికారుల ప్రజా ప్రతినిధుల సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించేందుకు కషి చేస్తున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు.

## వరద బాధితులకు సహకారం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకు ది కృష్ణా డిస్ట్రిక్



ఫైనాన్సియర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి 10 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరపున పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు వ్యాపార పారిశ్రామికవేత్తలు మరింత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోయేషన్ కార్యదర్శి వి.నాగార్జున, కోశాధికారి టి.హరికష్ణ, సుంకర వీరభద్రరావు, బివై. నారాయణాయరావు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికతతో మరిన్ని విజయాలు

**ప్రజాశక్తి-వన్‌టౌన్:** విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మరిన్ని విజయాలను సాధించవచ్చని ఎన్‌ఆర్‌ఐ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అధ్యాపకురాలు డాక్టర్ జీ శోభన అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో 'డేటా మినింగ్ టెక్నిక్స్ ఫర్ డేసిషన్ మేకింగ్' అంశంపై సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ శోభన మాట్లాడుతూ కామర్స్ అండ్ మేనేజమెంట్ విద్యార్థులు తమతమ విభాగాలల్లో నిర్ణయాలు తీసుకున్నటప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే మరిన్ని కచ్చితమైన ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, విభాగాధిపతి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంపై అవగాహన

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** వాసవ్య మహిళా మండలి విజయవాడ వారు ది లైవ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ మరియు సికె బిర్లా గ్రూప్ వారి సహకారంతో సాంత్వన ప్రాజెక్టు ఇబ్రహీంపట్నం మండలంలో చేపట్టారు. ఇందులో భాగంగా కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశా వర్కర్లకు మరియు ఏఎన్‌ఎం లకు మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ టి కేశవ తెలియపరిచారు. అవగాహన కార్యక్రమం లో మానసిక వ్యాధులను ఏ విధంగా గుర్తించాలి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎటువంటి సాంత్వన కలిగించాలి అనే అంశంపై తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతిపాల్గొన్నారు.

## డిఆర్‌యుసిసి సభ్యునిగా రవీంద్ర

**విజయవాడ:** విజయవాడ డివిజనల్ రైల్వే యూసర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిఆర్‌యుసిసి) సభ్యునిగా టి.రవీంద్రప్రతాప్‌కుమార్



నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన గత 25 సంవత్సరాలుగా బెజవాడ కన్స్యూమర్స్ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. రైల్వే యూసర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా 16 ఆగస్టు 2026 వరకు కొనసాగుతారు. రైల్వే వినియోగదారుల ఎదుర్కొంటున్న సమస్యలను 9440313265 నెంబర్‌కు తెలియజేస్తే రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు.

## అపర్ణ కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

**ప్రజాశక్తి-నందిగామ:** ముప్పాళ్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం



పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కస్తాల అపర్ణ అకాల మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మంగళవారం నందిగామ మార్చురి వద్ద అపర్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి 5 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ రవికిరణ్ పాల్గొన్నారు.

# బాధితులకు అండగా ఉంటాం : సుజన



**ప్రజాశక్తి-భవానీపురం:** 38వ డివిజన్ కుమ్మరిపాలెం ప్రాంత వరద బాధితులతో పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) కానూరు కెసిపి కాలనీలోని తమ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. బాధిత మహిళలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను విన్నారు. వరదలతో నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. నివేదికల ఆధారంగా ప్రభుత్వం పరిహారం ప్రకటిస్తుందని తెలియజేశారు. బాధితులు ఎవరుకూడా అధైర్య పడోద్దని ప్రతి ఒక్కరికి పరిహారం అందే విధంగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విపత్తు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంభవించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రధాని మోడీతో సహ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. అనుకోకుండా సంభవించిన వరద విపత్తు వలన ఏపీకి భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తూ బాధితుల కోసం విరాళాలను సేకరిస్తూ శరవేగంగా కూటమి ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి పరిహారాన్ని అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పితాని పద్మ, తమ్మిన లీల కరుణాకర్, గన్ను శంకర్, సురభి బాలు పాల్గొన్నారు.

## సోనీ బ్రావియా థియేటర్ యుని విడుదల

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** వేరబల్ సినిమా అనుభవం కోసం బ్రావియా థియేటర్ యుని విడుదల చేసినట్లు సోనీ షోరూం మేనేజర్ కె. ఎన్. ప్రసాదరావు తెలిపారు.ఎం.జీ.రోడ్డులోని షోరూం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సౌకర్యవంతమైన సినిమాటిక్ అనుభూతిని అందించడానికి రూపొందించబడిన అత్యాధునిక హెూమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సొల్యూషన్. బ్రావియాకి ఉంటుందని అన్నారు. వైర్‌లెస్ నెక్‌బ్యాండ్ స్పీకర్ ఓపెన్ ఎయిర్ అయినప్పటికీ, వ్యక్తిగతంగా వినడం కోసం మీ చెవులను చుట్టుముట్టే లీనమయ్యే ధ్వనిని అందిస్తుంది అన్నారు.. బ్రావియా థియేటర్ యునీ పరిసరాల గురించి చింతించాల్సిన అవసరం లేకుండా అధిక వాల్యూమ్‌లో లీనమయ్యే సినిమా అనుభూతిని థ్రిల్లింగ్ డాల్బీ అట్మోస్ తో అందిస్తుంది. అని తెలిపారు .బ్రావియా థియేటర్ యుని అనుకూలమైన బ్రావియాతో కలపడం ద్వారా చలనచిత్రాలను నమ్మశక్యం కాని రీతిలో లీనమయ్యేలా చేయవచ్చని అన్నారు.. 360 స్పేషియల్ సౌండ్ సోనీ యొక్క అనుకూలమైన బ్రావియా టీవీలతో జత చేసినప్పుడు వాతావరణ శ్రవణ కోసం మీ స్వంత ప్రాదేశిక ధ్వని క్షేత్రాన్ని సృష్టిస్తుందన్నారు. అన్ని ఎలక్ట్రానిక్ షోరూం లతో పాటు, సోనీ షోరూంలో లభ్యమవుతుందన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

**ప్రజాశక్తి-తిరువూరు:** తిరువూరు ప్రతిభ డిగ్రీ కళాశాలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాకదాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన మంగళ వారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ మోతిలాల్ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్ధనరావు, మేకల నాగేంద్రప్రసాద్, రాజవరపు శ్రీనివాసరావు, భూక్యా రాము, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌసిద్దీన్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బాలిక జట్లు ఎంపిక

**ప్రజాశక్తి-తిరువూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలకు తిరు వూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. 68వ ఎస్‌జిఎఫ్ అండర్ 14, అండర్ 17 బాలికల టోర్నమెంట్‌కు ఎంపిక చేసే ప్రక్రియ పోటీలను మంగళవారం బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంపీడీవో నాగేశ్వరరావు ఎంఈవో చదల రామకృష్ణ, హెచ్‌ఎం పి.సత్యనారాయణరాజు, విద్యా కమిటీ చైర్మన్ సుజాత, మాబున్నీసాలతో కలిసి పోటీలు ప్రారంభించారు.



# సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల నిరసన

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి జగనన్న కాలనీలో వీధి లైట్లు, మంచినీరు, రోడ్డు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వరద నష్ట పరిహారం జాబితాలో తమ పేర్లను నమోదు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం



వద్ద కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం సిఐటియు మండల కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తీవ్ర వరదల కారణంగా కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీలో 15 రోజులకు పైగా వరద నీటిలో బాధితులుగా ఉన్న కాలనీ వాసులకు వీధీ లైట్లు, మంచినీరు, రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వరద నష్ట పరిహారం బాధితులను నమోదు చేయాలని, ఆధార్ కార్డు మ్యాప్ అవ్వ లేదని కొంతమంది కీ పరిహారం చెల్లించటం లేదని, తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో కీ జగనన్న కాలనీ ని కలపి మౌలిక సదుపాయాల కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బాలాజీ, వర్మ, వీరయ్య, దేవి, జ్యోతి పాల్గొన్నారు.




## వరద బాధితులకు ఆర్థిక సహాయం


**ప్రజాశక్తి-నందిగామ:** వరద బాధితుల్ని ఆదుకునేందుకు మంగళవారం నందిగామ నియోజకవర్గంలోని నందిగామ, చందర్లపాడు, వీరులపాడు, కంచికచర్ల మండలాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల సంఘం సీఎంఆర్‌ఎఫ్ పేరుతో విరాళాల చెక్కును నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు అందజేశారు. స్థానిక కాకానీ నగర్ కార్యాలయంలో తంగిరాల సౌమ్యను మర్యాదపూర్వకంగా కలిసి రూ.13.76 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ అపోలో విద్యాసంస్థల అధినేత కాపా రవీంద్ర, ఏపీపీఎస్‌ఏ డెమోక్రటిక్ అధ్యక్షులు వై.రమేష్, కార్యదర్శి మొహ్మద్ మస్తాన్, కోశాధికారి కె. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాక్స్ ఫ్యాషన్ క్యాంపెయిన్ ప్రారంభం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** దుబాయ్‌కు చెందిన ల్యాండ్‌మార్క్ గ్రూప్ సంస్థ యొక్క ఫ్యాషన్ బ్రాండ్ మాక్స్ ఫ్యాషన్ ఇప్పుడు 'న్యూ న్యూ యు' పేరుతో సరికొత్త ప్రచారాన్ని మొదలుపెట్టిందని మ్యాక్స్ ఫ్యాషన్ మార్కెటింగ్ హెడ్ పల్లివి పాండే, రీజనల్ హెడ్ సుమిత్ చందనా తెలిపారు. బెంజ్ సర్కిల్ వద్ద గల షోరూం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. స్టైల్ ఐకాన్ కల్కి కేక్లాతో ప్రత్యేక సహకారంతో మ్యాక్స్ ఫ్యాషన్ బ్రాండ్ సరికొత్త అధ్యాయంలోకి అడుగు పెట్టడానికి సిద్ధమైందన్నారు.

## ఆట వస్తువులు అందజేత

**ప్రజాశక్తి-వత్సవాయి:** మక్కపేట గ్రామంలో అజ్మీరు వీరభద్రయ్య, తులశమ్మ మెమోరియల్ ట్రస్ట్, ఉపాధ్యాయ సేవాదళ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా సామాగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అజ్మీరు శ్రీనివాసరావు పాఠశాల హెచ్‌ఎం చిత్రాల వెంకటేశ్వరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌టియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్, దారావత్ శ్రీనివాసరావు, షేక్ జాన్, పిచ్చేశ్వరమ్మ, రేవతి, స్వప్న పాల్గొన్నారు.



# వరద బాధితులకు విరాళం



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న రావెళ్ల ఫౌండేషన్ చైర్మన్



ఎంఎల్‌ఎకు చెక్కు అందిస్తున్న పెద్దావుటపల్లిలోని సాయి శ్రీనివాసా హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామానికి చెందిన రావెళ్ల ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ళ ఉదయ్ కుమార్ మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయల చెక్ అందచేసారు. ఈ కార్యక్రమంలో కిలారు సోమశేఖర్, బత్తిన రాజేష్ బాబు, కాకర్లపూరి తేజా రాజు పాల్గొన్నారు. ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఉప్పులూరు, మంతెన, తెన్నేరు గ్రామాలలో వరద బాధితులకు పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ నిత్యావసర సరుకులు మంగళవారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిపి నెరుసు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపిపి దేవినేని రాజా, కంకిపాడు మండల పార్టీ అధ్యక్షులు సూదిమళ్ళ రవీంద్ర, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉంగుటూరు : పెద్దావుటపల్లి సాయి శ్రీనివాసా హైస్కూల్ విద్యార్థులు వారి తల్లిదండ్రు లు వారి వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడానికి ఇచ్చిన పాకెట్ మనీనివరద బాధితుల సహాయార్థం అందించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది సేకరించిన నగదు మొత్తం 95 వేల రూపాయలు చెక్కు రూపంలో గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుకు అందించి సిఎంఆర్ఎఫ్ ఫండ్ కు అందించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకట్రావు విద్యార్థులను పాఠశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె జి ఎస్ సాయిబాబా, పాఠశాల ఎస్‌పిఎల్ , మరియు జి పి ఎల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు ఈనాడు సహాయ నిధి ద్వారా గన్నవరం మండలం చిన్నఅవుటపల్లికి చెందిన పుణ్యా ఛారిటీస్ వద్ధాశ్రమం అండగా నిలిచింది. ఛారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్(బుజ్జి) రూ.లక్ష, ఆశ్రమంలో నివసిస్తున్న వద్ధులంతా రూ.36 వేలను అందజేశారు. మొత్తం రూ.1.36 లక్షలకు సంబంధించిన రెండు చెక్కులను సంస్థ విజయవాడ యూనిట్ బందానికి అందించారు. సాయం చేయాలన్న దఢ సంకల్పంతో ఆరు పదుల వయసులో వరద బాధితులకు "ఈనాడు" వేదికగా అండగా నిలిచిన ఆశ్రమ నిర్వాహకులు, వద్ధులకు సంస్థ ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వద్ధులు, నిర్వాహక బందం, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులు వరద బాధితులకు మంగళవారం దుప్పట్ల పంపిణీ చేశారు. విద్యార్థిని విద్యార్థులు 5000 రూపాయలు సమకూర్చుకొని వాటితో మండలంలోని కౌతరం 1 వార్డ్ లోని 50 మంది వరద బాధితులు, వద్ధులకు దుప్పట్లు అందజేశారు. విద్యార్థిని విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

## నష్టం నమోదులో అలసత్వం : రైతుల అవస్థలు



పాడైన పంటను చూపిస్తున్న రైతు

ప్రజాశక్తి-మోపిదేవి : ఇటీవల సంభవించిన కృష్ణా నది వరదల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పటికీ అధికారులు అలసత్వంతో నమోదు చేయక రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన కోసూరు రామచంద్రరావు అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఇటీవల వచ్చిన కృష్ణా నది వరదల కారణంగా ఉత్తర చిరువోలులంక సమీపంలో నది నుండి మురుగు డ్రైన్ లోకి వచ్చే క్రస్ట్ గేట్లు పనిచేయకపోవడంతో వరద నీరు చొచ్చుకొని వచ్చి పంటలు పూర్తిగా మునిగి దెబ్బతిన్నాయి . ఈనెల 11వ తేదీన కోసూరువారిపాలెం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి మొక్కజొన్న పంట దెబ్బతింది... నమోదు చేయాలని రైతు కోరగా మొక్కజొన్న నమోదు చేయడం లేదని దురుసుగా సమాధానం చెప్పినట్లు రైతు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పంటలను నమోదు చేసి పరిహారం అందిస్తామని ప్రకటన చేయటంతో తదుపరి రెండవ విడత వెళ్లి నమోదు చేయమని కోరగా అప్పటికి గడువు మునిసినది.. సైట్ క్లోజ్ అయింది నమోదు చేయడం కుదరదు అని దురుసుగా సమాధానం చెబుతున్నారని రైతు వాపోయారు. మూడు ఎకరాలు పంట దెబ్బతిని నాలుగు లక్షల రూపాయలకు పైగా ఆర్థికంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు నష్టపోయిన పంటను నమోదు చేసి పరిహారం అందించాల్సిందిగా కోరుతున్నారు.

## ఆక్వాకల్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఆక్వా కల్చర్ అభివృద్ధికి అన్ని విధాల తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డికే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని తన ఛాంబర్ లో మత్స్యశాఖ అధికారులు, ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో ఆక్వా రైతులకు గ్రామ సభలు నిర్వహించి నిషేధించిన యాంటీబయాటిక్స్ జాబితా తెలియజేసి వాటిని వాడకూడదని చైతన్య పరచాలన్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా షెడ్యూల్ తయారు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ఆక్వా, కోళ్ల దాణ దుకాణాలు, మత్స్యశాఖ కార్యాలయాల్లో అన్ని సచివాలయాల్లో రైతు సేవా కేంద్రాలలో నిషేధించిన యాంటీ బయాటిక్స్ జాబితాను పెద్ద అక్షరాలలో బాగా కనిపించే విధంగా ప్రదర్శించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారికి కూడా తెలియజేయాలన్నారు. ఆక్వా రైతులు వారు కొనుగోలు చేసిన దాణా కు సంబంధించిన బిల్లులను సంబంధిత దుకాణాల నుండి తప్పనిసరిగా తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు. మత్స్యశాఖ అభివద్ధి అధికారులు ( ఎఫ్ డి ఓ లు) వారి పరిధిలో ఆక్వారైతులతో క్లస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, ఏడీలు నాగబాబు, ప్రతిభ, రమేష్, ఎఫ్ డి ఓ లు అంజలి, మంజూష, సత్యనారాయణ, స్వామి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారిగా సిహెచ్.సాయి ప్రసాద్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సాయిప్రసాద్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారిగా సిహెచ్.సాయిప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లాకి బదిలీపై వచ్చారు. తొలుత జిల్లా కలెక్టర్ డికే బాలాజీని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.



డిఆర్‌ఎంకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

## ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమం ఉధృతం

- ధర్నాలో ఆల్ ఇండియా లోకో రన్నింగ్‌స్టాఫ్ అసోసియేషన్ నేతలు

ప్రజాశక్తి-విజయవాడ : రైల్వే రంగంలో పని చేసే ఉద్యోగుల సంక్షేమాన్ని, ప్రయాణికుల భద్రత కాపాడాలని కోరుతూ ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాలని, ప్రయాణికుల భద్రత కాపాడాలని, రైల్వే ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, ప్రమాదాలను నిలువరించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉద్యోగులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం వెంకటేషన్, కె రామకృష్ణ మాట్లాడుతూ రైల్వే యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉద్యోగుల సంక్షేమం, వారి భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ఎక్కడా లేని పని భారంతో పాటు వత్తిడి పెరిగిపోయి, విశ్రాంతి లేక ఉద్యోగులు పలు రూపాల్లో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారాంతపు సెలవుతో కలుపుకొని 46 గంటల విశ్రాంతి సమయం ఇవ్వాల్సి ఉండగా కేవలం 14 గంటలే ఇస్తున్నారని, డ్యూటీ అవర్స్ క్రమంగా పెరిగిపోయి, విశ్రాంతి లేక డ్రైవర్లు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. డివిజన్‌లో ఖాళీగా ఉన్న 18,799 రన్నింగ్ స్టాఫ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం రైల్వే డిఆర్‌ఎంకు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. విజయవాడ రైల్వే డివిజన్‌లోని బిట్రగుంట, రాజమండ్రి, విజయవాడ డివిజన్లలోని ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ వై నాగేంద్రబాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్ సెక్రటరీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అసోసియేషన్ నేతలు

# పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'



పమిడిముక్కలలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ప్రజాశక్తి-పమిడిముక్కల : వంద రోజుల పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం పమిడి ముక్కల సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి విటల్ పాల్, గ్రామ సర్పంచ్ ముల్లపూడి సునీత, గ్రామ కార్యదర్శి సుధాకర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు తాడిశెట్టి నరేష్, నాదెండ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ప్రజాశక్తి-పెదన : మండల పరిధిలోని నడపూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని 11 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మాజీ శాసనసభ్యులు సభ్యుడు బూరగడ్డ వేదవ్యాస్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి కిషన్ తేజ్, సర్పంచ్ లు చీర్ల అనూష, లక్ష్మీ కామేశ్వరరావు, చీర్ల కృష్ణ పాల్గొన్నారు. ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బాలవర్ధన రావు, పార్టీ మండల అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి, నీటిపారుదల సంఘం అధ్యక్షులు ఆళ్ళ గోపాలకృష్ణ, సర్పంచి కొరివి మాధవి, టిడిపి మహిళా నేతలు మూల్పూరి సాయి కళ్యాణి పాల్గొన్నారు. ప్రజాశక్తి-గన్నవరం : రానున్న ఐదేళ్ల ప్రజలు సుపరిపాలన చూస్తారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బాపులపాడు మండల పరిధిలోని వీరవల్లి, బండారు గూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. వీరవల్లి సర్పంచ్ పిల్లా అనిత , బండారు గూడెం సర్పంచ్ అమ్మాడి, ఎంపీటీసీ శివన్నారాయణ, వీరవల్లి పార్టీ ప్రెసిడెంట్ సురేంద్ర మోహన్ బెనర్జీ, నీటి పారుదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ , బచ్చుల బోస్, వేములపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రజాశక్తి కోడూరు : కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విచ్చేశారు. ముందుగా ఇంటింటికి తిరిగి 100 రోజులలో ప్రభుత్వం చేసిన అభివద్ధి కరపత్రాలు అందించి, ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్ శ్రీనివాస్, ఎంఈఓ రామదాసు, శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మీ, కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, మర్రె గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, కొల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## పలువురు ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక తాసిల్దార్ కార్యా లయంలో గత ఐదేళ్లగా పనిచేస్తున్న మండల సర్వేయర్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌లకు సాధారణ బదిలీలు అయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన అభినందన సభలో తాసిల్దార్ కనకదుర్గ వారి సేవలను అభినం దించారు. అనంతరం వారిని ఆర్ ఐ షకీలా బేగం, వీఆర్వోలు వెంకన్న, ప్రకాష్ ,భాస్కర్ రావు, మల్లికార్జునరావు, నాగరాజు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రజాశక్తి-పెదన : ఉద్యోగులకు బదిలీలు సంబంధిత కార్యాలయాల్లో సర్వ సాధారణమేనని మండల విఆర్ఓ సంఘ అధ్యక్షుడు పరస గోవిందరాజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యూటీ తాసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావు, రిసర్వే డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ కల్పన, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్ లు ప్రాంతాల్లో బదిలీపై వెళ్లారు. ఈ బదిలీలు పురస్కరించుకుని గత కొంతకాలంగా పెదన తాసిల్దార్ కార్యాలయంలో సేవలందిస్తున్న వారికి సిబ్బంది ఘనంగా సత్కరించారు.

# వరదకు నష్టపోయిన కార్మికులను ఆదుకోవాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు సిఐటియు వినతి

**ప్రజాశక్తి-విజయవాడ:** వరదలు, భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన వివిధ తరగతుల కార్మికులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను సిఐటియు ఎన్‌టిఆర్‌జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఇతర నాయకులు కలిసి మంగళవారం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణానది, బుడమేరు, మున్నేరు, పాలేరు వరదలు, భారీ వర్షాల వలన జిల్లాలోని 14 మండలాలు ముంపుకు గురయ్యాయన్నారు. విజయవాడలో 32 డివిజన్లు వరద ప్రభావానికి గురయ్యాయన్నారు. లక్షలాది మంది తీవ్రంగా నష్టపోయారన్నారు. నీట మునిగిన ప్రాంతాల నుంచి నగరంలో, జిల్లాలోని పలు ప్రాంతాలకు రోజూ వెళ్లి పనులు చేసే కార్మికులు పనులకు వెళ్లలేకపోయారన్నారు. భవన నిర్మాణ కార్మికులు వేలాది మంది పనులు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. వృత్తి పనిముట్లు కూడా వరదల్లో కొట్టుకుపోయాయని అన్నారు. ముంపుకు గురైన ప్రతి అసంఘటిత కార్మికుడు 15 రోజులు పని కోల్పోయారని, పనులు కల్పోయిన కార్మికులందరికీ ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ. 10 వేలు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ఫ్యాక్టరీలు, సంస్థలు, వర్తక, వాణిజ్య సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు 15 రోజులు వారి వేతనంలో ఎటువంటి కోతలు విధించకుండా వేతనాలు చెల్లించేలా, వారు హాజరుకాని రోజులను ప్రత్యేక సెలవులుగా గుర్తించేలా ఆయా యాజమాన్యాలను ఆదేశించాలన్నారు. ముంపుకు గురైన ఇళ్లకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వంతో సంబంధం ఉన్న అన్ని శాఖల్లో , ప్రభుత్వ స్కీముల్లో , మునిసిపల్, గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న అన్ని రకాల ఉద్యోగ, కార్మికులకు ఒక నెల వేతనం అదనంగా ఇవ్వాలన్నారు. ఆటోలు, ట్యాక్సీల రిపేర్లకు రూ.25 వేలనుంచి రూ. 35 వేలకు పైగా ఖర్చు అవుతుందని, ప్రభుత్వం కనీసంగా ఆటోలు, కార్‌లకు రూ. 25 వేలు, బైక్‌లకు రూ. 10 వేలు ఇవ్వాలని, ఫైనాన్స్ కంపెనీలకు కట్టాల్సిన కిస్తీలను , బ్యాంక్‌లకు చెల్లించాల్సిన ఇఎంఐలను రెండు నెలలు వాయిదా వేయాలని కోరారు. ఇన్సూరెన్స్ కంపెనీల నిబంధనలు సడలించమని కోరాలన్నారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, హాకర్లకు, పరిశ్రమలు, సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరారు. రుణాలు చెల్లింపు వాయిదా వేసి, సబ్సిడీతో కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీల నిబంధనలు సడలించి, పూర్తి పరిహారం ఇవ్వాలన్నారు. బ్యాంక్‌లు లక్ష రూపాయలకు తగ్గకుండా వడ్డీ లేని వినిమయ రుణాలు ఇవ్వాలన్నారు. ముంపు బాధితులైన మునిసిపల్ వర్కర్లు విధులకు హాజరు కాలేదని విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు సస్పెన్షన్ నోటీసు ఇచ్చారని, వాటిని ఉపసంహరించాలని, వారికి 15 రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలన్నారు. ముంపు ప్రాంతాల్లో రెండు నెలల విద్యుత్ బిల్లులు రద్దు చేయాలన్నారు. నాయకులు వివరించిన దానిపై కలెక్టర్ స్పందిస్తూ...కార్మికులందరికీ తగిన న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె దుర్గారావు, కార్యదర్శులు ఎ కమల, బి వెంకటేశ్వరరావు, నాయకులు ఎం సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు




## గిరిజన పథకాలు యథావిధిగా కొనసాగించాలి

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** గత ప్రభుత్వంలో రద్దయిన గిరిజన సంక్షేమ పథకాలను కొనసాగించాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఎం.జి.రోడ్డులోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, గిరిజనులతో నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ట్రైబల్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అక్కులప్ప నాయక్, రాగిరచంద్రప్ప మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సంక్షేమం కుంటుపడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ కన్వర్టెడ్ గిరిజన గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో పిజిటి ఉపాధ్యాయులు నియామకం లేకపోవడంతో గిరిజన విద్యార్థులకు విద్య అందనంత దూరంలో ఉందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం లేకపోవవంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు.తక్షమే తక్షణమే గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## బ్యాంకింగ్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

**ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక డాక్టర్ లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ సర్టిఫికెట్ కోర్సును కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్స్ ఇండియా బ్యాంకింగ్ రంగంలో వస్తున్న నవకల్పనలు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మైలవరం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి వంశీకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీకాం విద్యార్థులు డిజిటల్ చెల్లింపులు నెట్ బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్ కార్డుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కామర్స్ విభాగాధిపతి ఎం శ్రీనివాస్ రావు, డాక్టర్ జి రాముడు, ఎస్ కే కరీముల్లా, నారాయణరావు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## ఎల్‌బిఆర్‌సిఇ అధ్యాపకురాలికి పిహెచ్‌డి

**ప్రజాశక్తి-మైలవరం:** స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకురాలికి పిహెచ్‌డిని ప్రదానం చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షేక్ సల్మా ఆసియా బేగం విట్ ఏపీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పెప్పర్ కార్న్, లీఫ్ డిసీజెస్ క్లాసిఫికేషన్ అండ్ సెవెరిటి ఐడెంటిఫికేషన్ యూజింగ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పిహెచ్డిని ప్రధానం చేశారన్నారు. ఈ పరిశోధన డాక్టర్ హుస్సేన్ సయ్యద్ విట్ యూనివర్సిటీ స్కోప్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. ఈ పరిశోధన మిరియాలు, మొక్కజొన్న ఆకువ్యాధి వర్గీకరణ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి తీవ్రతను అంచనా వేయడంలో కచ్చి తత్వాన్ని పెంచటానికి బహుళ నమూనాలను మిళితం చేస్తుందన్నారు.



## రైలు ఢీకొని యువకుడు మృతి

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని స్టీల్‌ప్లాంట్ సమీపంలోని పాలేరు వద్ద గల రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతిచెందినట్లు రైల్వే ఎస్సై బి.వెంకటేశ్వర్లు తెలిపారు. యువకుడు 25 సంవత్సరాలు వయసు ఉంటాయని, మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

**ప్రజాశక్తి-విజయవాడ:** బుడమేరు, కృష్ణానది వరదతో పాటు భారీ వర్షాలకు వివిధ రకాల పంటలు పూర్తిగా దెబ్బతిని, రైతులు కోలుకోలేని రీతిలో నష్టం జరిగిందని, బాధిత రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు పివి ఆంజనేయులు, కోటా కళ్యాణ్ కోరారు. ఈ మేరకు వారు ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ (జె.డి) నాగ మణెమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...వరదలు, భారీ వర్షాలకు ఎన్‌టిఆర్ జిల్లాలో వివిధ రకాల పంటలు దెబ్బతిని రైతులు భారీ ఎత్తున నష్టపోయారని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, నష్టపోయిన రైతులను గుర్తించి, నమోదు చేయడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. జిల్లాలోని కోడూరు, చందర్లపాడు, గంపలగూడెం, మైలవరం, గణపవరం తదితర ఏరియాల్లో ఎస్సీ వాడల్లో, అలాగే దెబ్బతిన్న పంటలను ఎన్యుమరేషన్ చేయడంలో అధికారుల అలసత్వం, బాధ్యతారాహిత్యం వెల్లడయిందన్నారు. నేటికీ అనేక మంది బాధిత రైతులను గుర్తించ లేదన్నారు. దీని వల్ల రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని రూ. 75 కోట్లకు పైగా నష్టం జరిగిందని తమకు అందిన ప్రాథమిక అంచనా అని అన్నారు. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం నష్టం అంచనాను రూ. 58 కోట్లుగా తేల్చారని అన్నారు. జిల్లాలో రైతులు వేసిన వరి, కాటన్, పెసలు, మినుము, మొక్క జొన్న తదతర పంటలు సుమారు లక్ష ఎకరాలలోని పంట పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. సాగునీటి కోసం రైతులు వినియోగించే వందలాది మోటార్లు వరద నీటిలో కొటుకుపోయాయని, పదుల సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు పడిపోయాయని అన్నారు. 12 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ కింద సుమారు రెండు వేల ఎకరాల్లోని పంట దెబ్బతిన్నదన్నారు. జిల్లాలోని 24 చెరువులకు గండ్లు పడి సుమారు 30 వేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదన్నారు. బుడమేరు కింద అనేక చెరువులు తెగడం వలన బుడమేరు వరద ఉధృత రూపం దాల్చి విజయవాడ నగరాన్ని ముంచెత్తిందని, అంతేగాక వందలాది ఎకరాల్లోని పంటలు ముంపుకు గురయ్యాయన్నారు. నీరు-చెట్టు కింద అనేక చెరువ్లో మట్టి తొవ్వారని, అయితే కట్టలు పటిష్టంగా లేక వాటికి గండ్లు పడ్డాయని అన్నారు. ఇప్పటికయినా దెబ్బతిన్న పంటల అంచనాలను, నష్టపోయిన రైతుల లిస్ట్‌ను పారదర్శకంగా వెల్లడించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



## 26 నుంచి మింత్రా బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ ప్రారంభం

**ప్రజాశక్తి విజయవాడ అర్బన్**

అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్ (బిఎఫ్ఎఫ్) తేదీలను మింత్రా ప్రకటించిందనీ సంస్థ ఇంఛార్జి కె.రాజా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వ తేదీ నుంచి ప్రారంభం అవుతుంది అన్నారు.ఈ ఫెస్టివల్ నందు సుమారు 3.4 మిలియన్ స్టైల్స్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచి నట్లు తెలిపారు .ఈ ఉత్సవాల్లో దేశీయ, అంతర్జాతీయ, స్వదేశీ విభాగాలలో 9700 కన్నా ఎక్కువ ప్రముఖ బ్రాండ్‌లు పాల్గొంటాయి అని అన్నారు.. మింత్రా ఇన్సైడర్స్, మింత్రా లాయల్టీ ప్రోగ్రామ్ సభ్యులు 24 గంటల ముందుగానే, ఈ నెల 25వ తేదీన బిగ్ ఫ్యాషన్ ఫెస్టివల్‌కి ముందస్తు యాక్సెస్ పొందుతారు.అని తెలిపారు. అన్ని మింత్రా షోరూమ్లలో ఆఫర్లు ఉంటాయని అన్నారు.

# వరద నష్టంపై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలి

## మేయర్‌కు సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు వినతి


వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు

**ప్రజాశక్తి-విజయవాడ:** బుడమేరు, కృష్ణానది వరద ముంపుకు తీవ్రంగా నష్టపోయిన నగర ప్రజల స్థితిగతులు, వారి ఇబ్బందులను చర్చించడానికి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీకి మంగళవారం ఆమె చాంబర్‌లో సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదకు నష్టపోయిన ప్రజల ఇబ్బందులు, వారి కష్ట-నష్టాలపై సమగ్రంగా చర్చించి, తీర్మానం ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించడానికి అత్యవసరంగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, బుడమేరు, కృష్ణానది వరదలకు నగరంలోని 32 డివిజన్లల్లోని ప్రజలు అనేక రూపాల్లో పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. బుడమేరు వరద ముంపు ప్రభావానికి గురై ప్రజాజీవనం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన బుడమేరు వరద ఉధృతికి వేలాది కుటుంబాల ప్రజలు, వ్యాపార సంస్థలు, వివిధ కిరాణా దుకాణాలు ,వివిధ చేతి వత్తుల, చిన్న చిన్న వ్యాపారవర్గాలు వారు ఆస్తి నష్టం ,వాహనాలు, వ్యాపార సంస్థల, వస్తువులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వందల కోట్ల నష్టం జరిగిందన్నారు. విఎంసికి సంబంధించి వివిధ రూపాల్లో సుమారు రెండు వందల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారుల ప్రాథమిక అంచనాలు తెలుపుతున్నాయన్నారు. ఇదే రీతిలో లక్షలాది మంది ప్రజలు వందల కోట్లు నష్టపోయారన్నారు. వరద కారణంగా 15 రోజులు జనజీవనం స్తంభించిందన్నారు.వీటన్నింటిపై సమగ్రంగా చర్చించి, బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు వీలుగా కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.